# కానిస్టేబుళ్ల బదిలీలకు రంగం సిద్ధం

- మూడేళ్ల సర్వీసు పూర్తి చేసిన 69 మందికి స్థానచలనం?
- స్వంత మండలం మినహా 5 ఆప్షన్స్‌తో బదిలీలు
- ఈ నెల 30 వరకు దరఖాస్తుల స్వీకరణ

కరీంనగర్ క్రైం, మే 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో పనిచేస్తున్న సివిల్ కానిస్టేబుళ్ల సాధారణ బదిలీలకు రంగం సిద్ధమైంది. కమిషనరేట్‌లో వివిధ పోలీసు ఠాణాలు, సీఐ, ఏసీపీ కార్యాలయాలతో పాటు స్పెషల్ బ్రాంచి, టాస్క్‌ఫోర్స్ వంటి విభాగాల్లో విధులు నిర్వహి స్తున్న సివిల్ కానిస్టేబుళ్ల బదిలీలకు కసరత్తులు నడుస్తున్నాయి. ఒకే పోలీసు ఠాణాలో 3 ఏళ్ల సర్వీసు పూర్తి చేసిన కానిస్టేబుళ్ల బదిలీలకు అర్హులుగా పేర్కొంటూ, వీరికి కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేసేందుకు పోలీస్‌కమిషనర్ గౌస్ ఆలం ఉత్తర్వులు జారీ చేశారు. మూడేళ్లుగా ఒకే చోట పనిచేస్తున్న కానిస్టేబుళ్లకు మరో ఠాణాకు బదిలీ చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. మూడు సంవత్సరాల సర్వీసు పూర్తి అయిన కానిస్టేబుళ్లు కమిషనరేట్ వ్యాప్తంగా 69 మంది ఉన్నట్లు గుర్తిం చారు. ఈ 69 మంది కానిస్టేబుళ్లు ఐదు పోలీసు టాణాలను ఎంపిక చేసుకుని సీపీఓలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఒక్కో కానిస్టేబుల్‌కు ఐదు పోలీసు ఠాణాలను కోరుకునేందుకు (ఆప్షన్) అవకాశం కల్పించారు. ప్రాధాన్యతా క్రమంలో ఎంపిక చేసుకుని దర ఖాస్తులను సీపీ కార్యాల యంలో అందజే యాల్సి ఉం టుంది. అయితే కానిస్టేబుళ్లు వారి స్వంత మండలం కాకుండా ఇతర పోలీసు ఠాణాలను మాత్రమే బదిలీలకు ఎంపిక చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 30న చివరి గడువుగా విధించారు. గడువులోగా 69 మంది కానిస్టేబుళ్లు దర ఖాస్తు చేసుకున్న అనంతరం జూన్ నెలలో వీరందరికీ బదిలీలు చేయనున్నారు. వేసవి సెలవులు పూర్తయ్యేలోగా బదిలీలు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కొత్తగా బదిలీ అయిన కానిస్టేబుళ్ల పిల్లలు స్థానికంగా పాఠశాలల్లో, కళాశాలల్లో చేరేందుకు సమస్య రాకుండా వారు బదిలీ అయిన చోటనే పిల్ల ల చదువులు నడిచే విధంగా జూన్ 2వ వారంలోగా బదిలీలు చేసేందుకు చర్యలు తీసుకున్నారు.





- గతంలో కానిస్టేబుళ్ల బదిలీలకు 5 సంవత్సరాల సర్వీసు ఉండేది. మూడేళ్ల క్రితం నుంచి మూడేళ్ల సర్వీసు విధానాన్ని అవలంబిస్తున్నారు. గతంలోని మాదిరిగానే 5 ఏళ్ల సర్వీసు పూర్తి చేసినవారికే బదిలీలుంటే బాగుండునని పట్టణాలలో పనిచేస్తున్న సిబ్బంది కోరుకుంటుండగా, మారు మూల మండలాలలో పనిచేసేవారు మాత్రం మూడేళ్ల సర్వీసునే కొనసాగించాలని కోరుకుంటు న్నారు. మరి కొద్ది రోజుల్లో కానిస్టేబుళ్లకు హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతులు రానుం డటంతో అప్పుడు కాని స్టేబుల్ ఖాళీ అయ్యే అవకాశ ముంది. మళ్లీ మరికొందరికి బదిలీ అవకాశ ముంటుందని చెబుతున్నారు. హోంగార్డుల బదిలీలు కూడా త్వరలో చేపట్టే అవకాశముంది. కాళేశ్వరం సర స్వతి పుష్కరాల నేపథ్యంలో హోంగార్డులు కొందరు అక్కడ విధుల్లో ఉండటం కారణంగా బదిలీలు జరగలేదని సమ చారం. పుష్కరాలు పూర్తి అయిన వెంటనే హోంగార్డుల బదిలీలను కూడా పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీస్ కమిషనర్ కసరత్తులు పూర్తి చేసినట్లు సమాచారం. ఎస్సై బదిలీలు కూడా జరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఇటీవలనే కమిషన రేట్‌లో 9 మంది ఏఎస్‌ఐలకు ఎస్‌ఐలుగా పదోన్నతి లభించింది. ప్రస్తుతం వీరందరూ పాత పోస్టింగ్‌ల్లోనే ఎస్‌ఐగా పనిచేస్తున్నారు. పదోన్నతులు పొందినవారితో పాటు మరి కొందరు ఎస్సైలకు బదిలీలు జరిగే అవకాశముంది.

## గ్రామపాలన అధికారుల నియామక పరీక్షను పరిశీలించిన కలెక్టర్



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సప్తగిరికాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గ్రామపాలన అధికారుల(జీపీవో) నియామక పరీక్షను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదివారం పరిశీలించారు. గత ప్రభుత్వం రద్దు చేసిన వీఆర్‌వో, వీఆర్‌ఏలను తిరిగి రెవెన్యూ శాఖలోకి తీసుకునేందుకు గ్రామాల్లో రెవెన్యూ సేవల పున రుద్ధరణ కోసం గ్రామపాలన అధికారులను నియమించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. ఈ మేరకు జీపీవో పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వీఆర్‌వో, వీఆర్‌ఏలకు పరీక్ష నిర్వహించారు. 189 మంది వీఆర్‌వో, వీఆర్‌ఏలు ఈ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకోగా 172 మంది పరీక్షకు హాజరయ్యారు. రాత పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి ఏర్పా ట్లను పరిశీలించారు. అభ్యర్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీఆర్‌వో పవన్‌కుమార్, రెవెన్యూ డివిజనల్ అధికారి మహేశ్వర్, నెహ్రూ యువకేంద్ర కో-ఆర్డినేటర్ రాంబాబు, డీవైఎస్‌వో శ్రీనివాస్, ఏవో సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు జిల్లా సబ్ జూనియర్ అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27న జిల్లా సబ్ జూనియర్ అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసి యేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి తెలిపారు. బాలబాలికల విభాగంలో అండర్-8, అండర్-10, అండర్-12 వయస్సు విభాగాల్లో వివిధ క్రీడాంశాల్లో పోటీ లను నిర్వహించనున్నామని తెలిపారు. పోటీల్లో పాల్గొనుటకు ఆసక్తిగల క్రీడాకారులు ఉదయం 6 గంటలకు ప్రాంతీయ క్రీడా పాఠశాలలో రిపోర్టు చేయాలని సూచించారు. ఈ పోటీల్లో ప్రతిభచాటే క్రీడాకారులను సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానంలో జరగనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక చేయనున్నామని తెలిపారు. క్రీడాకా రులు తమ జనన ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

## పేదల కోసం పోరాడేది సీపీఐ ఒక్కటే

- సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి




ఇల్లందకుంట మండలం మల్యాలలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి

ఇల్లందకుంట, మే 25 (ఆంధ్రజ్యోతి): పేదల ప్రజల పక్షాన నిలబడి వారికోసం పోరాడేది సీపీఐ ఒక్కటేనని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. ఆదివారం ఇల్లందకుంట మండలం మల్యాల గ్రామంలో సీపీఐ మండల మహాసభ సమావేశం మాదారపు రత్నాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ పార్టీ మార్క్సిజం, లెని నిజం పునాదులపై ఆవిర్భవించిందన్నారు. సమా జంలో అంతరాలు లేని సమ సమాజ స్థాపన కోసం నిర్విరామ పోరాటం చేస్తుందన్నారు. భూమి లేని నిరుపేదలకు ఇండ్లు, రేషన్‌కార్డులు, పెన్షన్లు, యువతకు ఉపాధి, హక్కుల సాధన కోసం, పేద పిల్లలకు ఉచిత విద్య, వైద్యం కోసం అనేక పోరాటాలు చేసిన చరిత్ర సీపీఐకి ఉందన్నారు. దున్నేవాడికే భూమి కావాలని భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం, బానిసత్వం పోవాలని వీరోచితంగా సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి సీపీఐ నాయకత్వం వహించిందన్నారు. దేశంలో ప్రధాని మోదీ ప్రభుత్వం వచ్చి 11 సంవత్సరాలు అవుతున్నా పేదవాడి సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఛత్తీస్‌ఘడ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పంజాల శ్రీనివాస్, ఇజ్జిగిరి రాంగోపాల్, బుర్ర సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ ఆదేశాలను పాటిస్తాం

- లేఖ కాకుండా వ్యక్తిగతంగా చెప్తే బాగుండు
- కేటీఆర్ వ్యాఖ్యలతో ఏకీభవిస్తున్నా
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి,ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగనర్ రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ ప్రజాస్వామ్య పార్టీ, ప్రతి ఒక్కరి అభిప్రాయాలను తెలియజేయవచ్చు. కేసీఆర్ తమ నాయకుడు ఆయన ఆదేశాలను పాటిస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పేర్కొన్నారు. ఆదివారం కరీంనగర్ శివారు 20వ డివిజన్ ఆరపల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత కేసీఆర్‌కు రాసిన లేఖపై ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత తమ అభిప్రాయాన్ని బహిరంగ లేఖ రాయడం కాకుండా కేసీఆ ర్‌కు వ్యక్తిగతంగా విషయాలను చెప్పి ఉంటే బాగుండేదన్నారు. కేటీఆర్ చేసిన వ్యాఖ్యలతో ఏకీభవిస్తున్నట్లు తెలిపారు. కవిత పార్టీ పెట్టడం అనేది ఊహాగానాలే అని కొట్టి పడేశారు. ఎన్నారైల ఆధ్వర్యంలో జూన్ 2వ తేదీన అమెరికాలోని డల్లాస్‌లో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేడుకలకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు జిల్లాకు చెందిన ఎమ్మెల్యే పాడి కౌశిక్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ హాజరవుతున్నట్లు తెలిపారు. అమెరికాలో ఎన్నారైల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆవిర్భావ వేడుకలకు ఎమ్మెల్యేలందరూ హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ నెల 31వ తేదీన న్యూయార్క్‌లో బీఆర్‌ఎస్ ప్రిలిమినరీ సమావేశం ఉంటుందని సుమారు 12 రోజుల పాటు పర్యటన ఉంటుందని తెలిపారు.

### అభివృద్ధి పనులకు భూమి పూజ

కరీంనగర్ పట్టణంలోని 20వ డివిజన్‌లో స్మశానవాటిక నిర్మాణానికి 15వ ఫైనాన్స్ నిధుల నుంచి సుమారు 49.50లక్షల రూపాయలు వె చ్చించి అభివృద్ధి పనులకు, ఆరపల్లి నుంచి రాణిపూర్, నగునూర్ దుర్గా మాత ఆలయానికి వెళ్లే దారిలో సాధారణ నిధుల ద్వారా సుమారు 12లక్షల రూపాయలు వెచ్చించి కల్వర్టు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ కార్పొరేటర్‌లు తుల బాలయ్య, జంగిలి సాగర్, జంగిలి ఐలేందర్ యాదవ్, దిండిగాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

- సేవాభావంతో వైద్యం అందించాలి
- డాక్టర్ల సమస్యలను పరిష్కరించేందుకు కృషి
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

సుభాష్‌నగర్, మే 25(ఆంధ్రజ్యోతి): తమ ప్రభుత్వం డాక్టర్లకు అండగా ఉంటుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఆదివారం కరీంనగర్ లోని ప్రతిమ మల్టీప్లెక్స్‌లో తెలంగాణ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తానా కాన్-2025 పేరుతో రాష్ట్ర సదస్సును నిర్వహించారు. ఈ సదస్సు ముగింపు కార్యక్రమా నికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆసు పత్రికి వచ్చిన ప్రతి పేషంట్‌కు మెరుగైన వైద్యం అందించి బతికించాలని డాక్టరు తాపత్రయపడ తాడని అన్నారు. అయితే కొన్ని సందర్భాల్లో పేషెంట్ ప్రాణా పాయ స్థితికి చేరుకుంటాడని అన్నారు. ఇలాంటి సందర్భంలో ఆసుపత్రులపై దాడులు జరుగు తాయని, ఇలాంటి సంఘటన వైఎస్‌ఆర్ సీఎంగా ఉన్నపుడు ఇదే కరీంనగర్‌లో జరిగిందని, ఆ సంఘటన తరువాత డాక్టర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఆయన ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకువచ్చారని తెలిపారు. డాక్టర్ల సేవలను ప్రభుత్వం గుర్తిస్తుందన్నారు. 50 పడకలు లోపు పడకలు ఉన్న ఆసుపత్రుల ఏర్పాటు కోసం అనుమతులకు సంబధించిన నిబంధనలు కష్టతరంగా ఉన్నాయని, వాటిని సవరించాలని చాలా మంది డాక్టర్లు తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. అయితే ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు.

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఫోన్ ద్వారా తన సందేశాన్ని అందించారు. వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందన్నారు. ప్రజల ఆరోగ్యం కాపాడేందుకు డాక్టర్లు ఎనలేని కృషి చేస్తున్నారని కొనియాడారు. డాక్టర్లకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎలాంటి సమస్యలు వచ్చినా పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆద్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, డాక్టర్ సంజయ్, డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, సుడా చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, సదస్సు చైర్మెన్ డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ చాట్ల శ్రీధర్, కోశాధికారి డాక్టర్ బండారి రాజ్‌కుమార్, తానా ఎలెక్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ అరుణ్‌కటారి, కరీంనగర్ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేష్, సీనియర్ వైద్యులు డాక్టర్ జగన్‌మోహన్‌రావు, డాక్టర్ రమణాచారి, డాక్టర్ బిఎన్ రావు, డాక్టర్ ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



తానాకాన్ రాష్ట్ర వైద్యుల సదస్సు ముగింపు కార్యక్రమంలో జ్యోతిప్రజ్వలన చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

## తరగతి గదుల్లో సెల్‌ఫోన్ నిషేధం

- విద్యాశాఖ ఆదేశాలు
- ఈ విద్యాసంవత్సరం నుంచి ఆంక్షలు మరింత కఠినం
- ఆదేశాలు పాటించకపోతే చర్యలు
- జిల్లాలో 5వేల మంది టీచర్లు



కరీంనగర్ టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు సెల్‌ఫోన్ వాడకంపై విద్యాశాఖ పూర్తిగా నిషేధం విధించింది. పాఠశాల పనివేళల్లో తరగతి గదుల్లో ఉపాధ్యాయులు ఇకపై సెల్‌ఫోన్‌లు వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవంటూ రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలో ప్రారంభం కానున్న విద్యా సంవత్సరం నుంచే సెల్‌ఫోన్ వినియోగంపై పూర్తి స్థాయిలో ఆంక్షలు అమల్లోకి వస్తా యంటూ అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఇటీవల డీఈవో లతో పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా నిర్వహించిన సమా వేశంలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కరీంనగర్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలు 1,064 ఉండగా , అందులో 9,584 మంది ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నారు. అ యితే ప్రభుత్వ పాఠశాలల్లో సెల్‌ఫోన్ నిషేధం గతంలో నుంచే అమలు చేసినా సంపూర్ణంగా విజయవంతం కాలేదు. చాలా చోట్ల ప్రభుత్వ పాఠశాలల్లో సెల్‌ఫోన్ వాడకం కొనసాగింది. చాలా వరకు ప్రైవేటు పాఠ శాలల్లో సెల్‌ఫోన్ వాడకం పూర్తిగా నిషేధం. ప్రభుత్వం తీసుకున్న ఈ ని ర్ణయంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తుండగా ఉపాధ్యాయ వర్గాల్లో మాత్రం భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. పలు ప్రభుత్వ పాఠ శాలల టీచర్లు బోధన పక్కన పెట్టి సెల్‌ఫోన్ మాట్లాడటం, ఇన్‌స్టాగ్రాం, రీల్స్ చూడటం, ఫేస్‌బుక్, సోషల్ మీడియాలో ఉంటూ తరగతి గదిలో సెల్‌ఫోన్‌తో హల్‌చల్ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. బాధ్యతలు విస్మ రించి విద్యార్థుల ఏకాగ్రతను దెబ్బతీసేలా కొందరు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇంకొంత మంది పాఠశాలకు వచ్చిన నుంచి సాయంత్రం వరకు ఫోన్‌లోనే మునిగితేలుతున్నారని విద్యార్థులు ఆరోపి స్తున్నారు. టీచర్ల వ్యవహారం తల్లిదండ్రుల్లో విస్మయానికి గురి చేస్తోంది. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ఎట్టి పరిస్థితుల్లో తరగతి గదిలో సెల్ ఫోన్ వాడకుండా కట్టడి చేయాలని సర్కార్ భావించింది. విద్యాశాఖ అధి కారులు తనిఖీలకు వెళ్లిన సందర్భంలో తరగతి గదిలో సెల్‌ఫోన్ వాడు తున్నట్లు ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఇకపై కఠిన చర్యలు తీసుకోనున్నారు. అయితే సెల్‌ఫోన్ నిషేధం ఏ మేరకు అమలవుతుందో వేచి చూడాల్సిందే.

## సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయులే కీలకం

కరీంనగర్ టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయులే కీలకం, తెలంగాణ రాష్ట్రంలో సంపూర్ణ అక్షరాస్యతను సాధించడానికి, విద్యావం తులుగా తీర్చిదిద్దడానికి కీలకంగా ఉన్న ఉపాధ్యాయులు విద్యావ్యాప్తిని ఉద్యమంగా ముందుకు తీసుకుపోవాలని, అప్పుడే రాష్ట్ర అభివృద్ధి సాధ్యపడుతుందని టీజీఈ జేఏసీ చైర్మన్, టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్(టీఆర్‌టీఎఫ్) రాష్ట్రస్థాయి ఉద్యమ అధ్యయన తరగతులను రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కటకం రమేశ్, మారెడ్డి అంజిరెడ్డిలతో కలిసి మారం జగదీశ్వర్ ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉన్న అన్ని రకాల సమస్యలకు, అభివృద్ధికి ప్రధాన ఆటంకం విద్యావంతుల కొరతేనని, గుణాత్మకమైన విద్యను సాధించినప్పుడే రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని అన్నారు. సమాజంలో సంపూర్ణ అక్షరాస్యతను సాధించడం, విజ్ఞానవంతమైన సమాజంగా అభివృద్ధి పరచడంలో కీలకపాత్ర పోషించేది ఉపాధ్యాయులేనని, ఆ బాధ్యత గుర్తెరిగి ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సారథ్యంలో ఏర్పడిన జేఏసీ హక్కుల సాధనలో ముందుంటుందని, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ 2 నాటికి ఉద్యోగులందరికీ సమస్యల పరిష్కారానికి ముందడుగు పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యమ అధ్యయన తరగతుల ప్రిన్సిపాల్, ఏపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర అధ్యక్షులు రాష్ట్ర అధ్యక్షులు సుబ్బా రెడ్డి, రాష్ట్ర గౌరవాధ్యక్షులు మానేటి ప్రతాపరెడ్డి, సంఘ చీఫ్ ప్యాట్రన్ లక్కిరెడ్డి సంజీవరెడ్డి, రాష్ట్ర కన్వీనర్ విష్ణుమూర్తి, ఎస్ ప్రభాకర్‌రావు, ఖాజా మంజూర్ అలీ, అశోక్‌రావు, కాసు మహేందర్‌రాజు, సలీం, తుంగూరి సురేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్


ఏసీటీఓలకు అందని గెజిటెడ్ హోదా
- ప్రభుత్వాలు మారినా నెరవేరని కల
- ఏళ్ల తరబడి అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నపాలు 6

పుష్కరాలకు పోటెత్తిన భక్తులు 7

## ఉద్యోగం రాదనే బెంగతో యువకుడి ఆత్మహత్య



సంపత్ (ఫైల్)

గంభీరావుపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం రాదనే బెంగతో బీటెక్ చదివిన ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్ప డిన ఘటన రాజన్నసిరిసిల్లజిల్లా గంభీరావు పేటలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన గుడికాడి సంపత్ (23) రెండేళ్లక్రితం బీటెక్ పూర్తిచేశాడు. రెండే ళ్లుగా ఆయా కంపెనీలు చుట్టూ ఉద్యోగం కోసం తిరుగుతున్నాడు. చాలా ఇంటర్వ్యూలకు హాజరయ్యాడు. అయినా సంపత్ ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో ఉద్యోగం రాదనే బెంగ సంపత్‌ను వెంటాడింది. ఉద్యోగ ప్రయత్నంలో తాను ఓడిపోతున్నాననే మానసిక బాధను తల్లిదండ్రులతో చెప్పుకునేవాడు. ఆదివారం ఇంట్లో వాళ్లు ఓ శుభకార్యానికి వెళ్లగా సంపత్ తమ వ్యవసాయ పొలం వద్ద షెడ్డులో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ప్రేమానందం తెలిపారు. మృతుడికి తండ్రి శ్రీనివాస్, తల్లి సత్తవ్వ, చెల్లె తేజ ఉన్నారు.

## రెండు కార్లు ఢీ.. ఇద్దరికి స్వల్పగాయాలు



ఎదురెదురుగా ఢీకొన్న కార్లు

చందుర్తి మే 25 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండల కేంద్రంలో రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. గ్రామస్థుల పోలీసుల కథనం ప్రకారం కథలాపూర్ మండలంకు చెందిన కర్క రాజేష్ అనే వ్యక్తి వేములవాడ వైపు వెళ్తుండగా, నిజామాబాద్‌కు చెందిన రాహుల్ అనేవ్యక్తి వేములవాడ రాజన్న దర్శనం చేసుకొని వెళ్తుండగా చందుర్తిలో ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ సంఘటనలో గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో చందుర్తి ఎస్ఐ అంజయ్య వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు.ఈ సంఘటనపై విచారణ చేపట్టమని ఎస్ఐ పేర్కొన్నారు.

## ఓదెల మల్లన్న ఆలయంలో భక్తుల సందడి



ఆలయ సమీపంలోని చెట్ల కింద భక్తులు

ఓదెల, మే 25 (ఆంధ్రజ్యోతి ): జిల్లాలో ప్రసిద్ధి గాంచిన భ్రమరాంబ మల్లికార్జునస్వామి క్షేత్రంలో ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి సందడి చేశారు. రోహిణి కార్తె ప్రవేశించిన సందర్భంగా వివిధ జిల్లాలు, మండలాల నుంచి రైతులతో పాటు వివిధ వర్గాలకు చెందిన భక్తులు తరలివచ్చి ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించారు. కోడె మొక్కులతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించిన భక్తులు, బోనాలతో మల్లన్నకు మొక్కులు సమర్పించారు. అనంతరం భ్రమరాంబ మల్లికార్జునస్వామికి మొక్కులు సమర్పించిన తరువాత బంగారు పోచమ్మ , మదన పోచమ్మకు మొక్కులను సమర్పించారు.

## ముడుపుల సొమ్ము లెక్కింపు

మల్యాల, మే 25 (ఆంధ్రజ్యోతి): కొండగట్టులో పెద్ద హనుమాన్ జయంతి సందర్భంగా భక్తులు సమర్పించిన ముడుపులలో కొన్నింటిని ఆదివారం దేవస్థానం అధికారులు విప్పి అందులోని సొమ్ములను లెక్కించారు. ఇందులో రూ.85,094 నగదు లభించింది. కార్యక్రమంలో ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షణ అధికారిరాజమౌళి, సుపరింటెండెంట్లు చంద్రశేఖర్, హరిహరనాథ్, సిబ్బంది,శ్రీవల్లి సేవాసమితిసభ్యులు పాల్గొన్నారు.

## భక్తుడికి సెల్‌ఫోన్ అప్పగించిన ఈవో

ధర్మపురి, మే 25 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో తొగుట లక్ష్మణాచారి అనే ఒక భక్తుడు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ఆదివారం ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆయనకు అప్పగించాడు. కథలాపూర్ మండల కేంద్రానికి చెందిన లక్ష్మణాచారి ఉదయం స్వామి దర్శనం కోసం వచ్చాడు. ఆ సమయంలో అతను తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. ఆలయ సెక్యూరిటీ సిబ్బంది బీరయ్యకు సెల్‌ఫోన్ దొరకగా వెంటనే ఆయన ఈవో శ్రీనివాస్‌కు అప్పగించాడు. ఆయన మైక్ ద్వారా అనౌన్స్ మెంట్ చేయించగా ఫోన్ పోగొట్టుకున్న భక్తుడు లక్ష్మణాచారి వచ్చి ఈవో చేతుల మీదుగా తీసుకున్నాడు.




# డిగ్రీలో కొత్త కోర్సు

## బైపీసీ విద్యార్థులకు బీఎస్సీ హెల్త్ కేర్ మేనేజ్మెంట్

- దోస్త్ విధానంలో ప్రవేశాల ప్రక్రియ
- తృతీయ సంవత్సరంలో భృతి

గణేశ్‌నగర్, మే 25 (ఆంధ్రజ్యోతి): వైద్యరం గంలో విస్తృతంగా ఉద్యోగ అవకాశాలు పెరుగు తున్నాయి. కొన్ని విభాగాల్లో నైపుణ్యం కలిగిన వారి కొరత వేధిస్తోంది. వాటిని అధిగమించి యువత త్వ రగా స్థిరపడేందుకు బీఎస్సీ హెల్త్ కేర్ మేనేజ్మెంట్ కోర్సును ప్రభు త్వం ప్రవేశ పెట్టింది. దోస్త్ విధానంలో ప్రవేశాల ప్రక్రి య కొనసా గుతోంది. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో క్రిస్ (సెంటర్ ఫర్ రీసెర్చ్ ఇన్ స్కీమ్స్ అండ్ పాలసీస్) విభాగం ఈ కోర్సును రూపొందించింది.

### ఉద్యోగ అవకాశాలు

మూడేళ్ల కోర్సు పూర్త వగానే విద్యార్థుల నైపుణ్యాల ఆధారంగా ఉద్యోగావకాశాలు ఉంటాయి. హెల్త్ కేర్ అడ్మినిస్ట్రేటర్, హాస్పిటల్ మేనేజర్, హెల్త్ ఇన్సూరెన్సు అనలిస్టు, మెడికల్ ఆఫీస్ మేనేజర్,



పబ్లిక్ హెల్త్ ప్రోగ్రాం మేనేజర్, హెల్త్ డాటా అనలిస్టు, క్వాలిటీ కంట్రోల్ ఎగ్జిక్యూటివ్, హెల్త్ కేర్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఉద్యో గాలు లభిస్తాయి. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు, ఆరోగ్య బీమా, మెడికల్ టూరిజం కంపెనీలు, క్లినికల్ పరిశోధనా సంస్థలు, వైద్యా రోగ్య శాఖ, హెల్త్ టెక్ స్టార్టప్స్ విభాగాల్లో స్థిరపడవచ్చు. నైపుణ్యం ఉన్న వారికి అమెరికా, కెనడా, యూఏఈ, ఆస్ట్రేలియా, యూకే దేశాల్లో అవకాశాలు ఉన్నాయి. ఆసక్తి ఉంటే ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్మెంట్, ఎంపీహెచ్ (మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్), ఎమ్మెస్సీ (హెల్త్ అడ్మినిస్ట్రేషన్), పీజీ డిప్లొమా- క్లినికల్ రీసెర్చ్, హెల్త్ ఎకనామిక్స్ కోర్సులు చదువుకోవచ్చు.

### కోర్సులో అంశాలు

ప్రభుత్వ, ప్రైవేటు ఆరోగ్య రక్షణ సంస్థలు, ఆసుపత్రి పాలనా విభాగం, ఆర్థిక నిర్వహణ, వైద్య నైతిక విలువలు, ఆరోగ్య సమాచార వ్యవస్థ, నాణ్యతా ప్రమాణాలు, ప్రజా రోగ్య వ్యాధుల నియంత్రణ వ్యవస్థ తదితర అంశాలు కోర్సులో పొందుపర్చారు. రెండేళ్ల కళాశాలలో చదువు కోవాలి. అధ్యాపకులతో పాటు ఆయా రంగాల నిపుణులను ఆహ్వానించి తర గతులు బోధిస్తారు. మూడో సంవ త్సరం విద్యార్థులు అప్రెంటిస్ షిప్ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, ఆసుపత్రుల్లో విద్యార్థులు చేరాల్సి ఉంది. విద్యా ర్థులకు ప్రతి నెలా తొమ్మిది వేల రూపా యల భృతి చెల్లిస్తారు. ప్రభుత్వం, విద్యార్థులు పని చేసే సంస్థ 50 శాతం చొప్పున చెల్లిస్తాయి.

### విద్యార్థులకు చక్కటి అవకాశం

- ప్రొఫెసర్ డి వరలక్ష్మి, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్



వైద్య రంగంలో కొన సాగాలని, త్వరగా స్థిరపడాలని ఆశించే వారికి ఈ కోర్సు చక్కటి అవకాశం. మా కళాశాలలో హెల్ప్ డెస్క్ అందుబాటులో ఉంది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

## ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలి బైఠాయింపు

జ్యోతినగర్, మే 25 (ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్ 5వడివిజన్ పరిధిలోని నర్రశాలపల్లిలో ఆదివారం ప్రియుడి ఇంటిఎదుట ప్రియురాలు(26) బైఠాయించింది. గ్రామానికి చెందిన యువతి, అదే కాలనీకిచెందిన బంధువైన యువకుడు ప్రేమించుకున్నారు. అయితే ఆ యువతి తల్లిదండ్రులు వారిప్రేమను అంగీకరించకుండా మంచిర్యాలజిల్లాకు చెందిన వేరే యువకుడితో మూడేళ్లక్రితం పెళ్లిచేశారు. పెళ్లితరువాత కూడా ఆయువతి ప్రియుడితో ప్రేమ కొనసాగించింది. ఈ క్రమంలో ఆ యువతి ఒకపాపకు జన్మనిచ్చింది. అయినా వారిద్దరి మధ్య బంధం కొనసాగుతూనే ఉంది. మూడునెలల క్రితం భర్తను విడిచిప్రియుడితో వెళ్లిపోయింది. మంచిర్యాలలోనే ఒక ఇళ్లు అద్దెకు తీసుకొని కాపురం పెట్టారు. ఈనేపథ్యంలో తమ కూతురు కనిపించడం లేదని ఆమె తల్లిదండ్రులు ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసునమోదైంది. తరువాత దర్యాప్తులో ఆ యువతి జాడ తెలుసుకొన్న ఎన్టీపీసీ పోలీసులు ఆమెను తల్లిదండ్రులకు అప్పగించారు. ప్రేమించిన యువకుడినే పెళ్లి చేసుకుంటానని ఆమె తల్లిదండ్రులకు స్పష్టం చేసింది. తల్లిదండ్రులు కులపెద్దల సమక్షంలో పంచాయతీపెట్టారు. ప్రియురాలు భర్తకువిడాకులిస్తే పెళ్లి చేసుకుంటానని ప్రియుడుతెలిపాడు. ప్రియుడి మాటలు నమ్మిన ఆమె విడాకులు తీసుకుంది. అయితే విడాకులు తీసుకున్న తరవాత ఆ యువతితో పెళ్లి చేసుకునేందుకు ప్రియుడు నిరాకరించాడు. దీంతో ఆమె తాడోపేడో తేల్చుకునేందుకు ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయించి నిరసనకుదిగింది. దీంతో ప్రియుడు, తల్లిదండ్రులు ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు. ఎన్టీపీసీ ఎస్ఐ-2 మానస ఆ ఇంటివద్దకు చేరుకొని యువతికి కౌన్సెలింగ్ ఇచ్చారు. పూర్తివివరాలతో ఫిర్యాదు చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, న్యాయంజరిగేలా చూస్తామని ఎస్ఐ హామీ ఇచ్చారు. పోలీసుల హామీతో ఆ యువతి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది.

## మట్టి కోసమా? గుప్త నిధుల కోసమా?

- తాపాల నర్సింహస్వామి గుట్ట చుట్టూ తవ్వకాలు

తిమ్మాపూర్, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకృష్ణ కాలనీ శివారులో దిగువమానేరు జలాశయంలో ఉన్న శ్రీతాపాల నర్సింహస్వామి గుట్ట చుట్టూ కొందరు ఆదివారం మట్టి తవ్వకాలు జరిపారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. తాపాల నర్సింహస్వామి గుట్టచుట్టూ ఆదివారం కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఎక్స్‌కావేటర్‌తో గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టారు. ఇది గమనించిన రైతులు గ్రామస్థులకు సమాచారం అందించారు. దీంతో గ్రామస్థులు తవ్వకాలు జరిపే ప్రదేశానికి వెళ్లి ఎందుకు తవ్వుతు న్నారు అని ప్రశ్నించారు. దీంతో వారు పొంతన లేని సమాధానం చెబుతూ గొడవకుదిగారు. తమకు ఇరిగేషన్‌శాఖ అధికారుల అనుమతులు ఉన్నాయని గ్రామస్థులపై ఎదురుదాడికి దిగారు. దీంతో గ్రామస్థులు సంబంధిత అధికారులను అడిగారు. అధికారులు తాము ఎవరికీ అనుమతులు ఇవ్వలేదని చెప్పడంతో గ్రామస్థులు వారిని నిలదీశారు. దీంతో వారు సమాధానం చెప్పలేక అక్కడినుంచి వెళ్లిపోయారు. ఇంతకీ దేనికోసం తవ్వకాలు జరిపారో విచారణ చేపట్టి వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.



గుట్ట వద్ద ఎక్స్‌కావేటర్‌తో తవ్వకాలు

## హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలకు స్పందన



హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జూనియర్ బాలబాలికల హ్యాండ్‌బాల్ పోటీలకు విశేష స్పందన లభించింది. కరీంనగర్ జిల్లా కేంద్రానికి సమీపంలోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఈ పోటీలకు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 150మంది క్రీడాకారులు హాజరయ్యారు. జిల్లాహ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్ పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఎంపికైన జట్లు జూన్ 4, 5, 6 తేదీల్లో నల్గొండ జిల్లా నకిరేకల్‌లో జరిగే 47వ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని అధ్యక్షకార్యదర్శులు తెలిపారు. సంఘం సంయుక్తకార్యదర్శి నమిలకొండ ప్రభాకర్, హ్యాండ్‌బాల్ కోచ్‌మూల వెంకటేశ్, దాసరిమల్లేశ్, పెద్దపల్లి సురేందర్, సిరిసిల్ల కృష్ణహరి, వ్యాయామ ఉపాధ్యాయులు రాజు, తిరుమలేష్, శ్రీకాంత్, విజయ్, సూర్య, అమర్‌రాజ, సాయి, శివాజీ పాల్గొన్నారు.

## ధాన్యం రాశులను ధ్వంసం చేసిన అడవి పందులు

చందుర్తి, మే 25 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు తీసుకురాగా అడవిపందులు ధ్వంసం చేశాయి. మండలంలోని లింగంపేట గ్రామానికి చెందిన రైతు ఆలూరి లక్ష్మణ్‌రావుకు చెందిన ధాన్యం రాశులను శనివారం రాత్రి అడవి పందులు చెల్లా చెదురు చేశాయి. గ్రామానికి సమీపన అటవీ ప్రాంతం విస్తరించి ఉండటంతో అడవి పందులు,కోతులు, తదితర వన్య ప్రాణులు సరిహద్దు గ్రామాల్లోని పంటలను ధ్వంసం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చి నెలలు దాటినా కొనుగోళ్ల లేక నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## అదుపు తప్పి కెమికల్ ట్యాంకర్ బోల్తా

సుల్తానాబాద్, మే 25: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్‌లోని సుగ్లాంపల్లి వద్ద రాజీవ్ రహదారిపై ఓ కెమికల్ ట్యాంకర్ బోల్తా పడింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజమండ్రి నుంచి రామగుండం బయలు దేరిన కెమికల్ ట్యాంకర్ సుగ్గాంపల్లి వద్ద ఆదివారం తెల్లవారురూమున రాజీవ్ రహదారి పక్కన బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లారీలో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను సమీపప్రాంత యువకులు బయటకు తీశారు. నిద్రమత్తులో ప్రమాదం జరిగిఉంటుందని భావిస్తున్నారు. డ్రైవర్‌స్వల్పగాయాలతో బయటపడ్డారు.



సుగ్లాంపల్లి వద్ద బోల్తా పడ్డ ట్యాంకర్

## వర్షానికి కూలిన ఇళ్లు

ధర్మపురి, మే 25 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని నేరెళ్ల గ్రామంలో మూడు రోజుల నుంచి కురిసిన వర్షానికి ఓరుగంటి లక్ష్మి, ఆశయ్య, మంత్రి భూమక్క ఇళ్లపైకప్పు కూలిపోయాయి. కాంగ్రెస్‌పార్టీ మండల అధికారప్రతినిధి, న్యాయవాదిజాజాల రమేష్,మాజీ ఎంపీటీసీ రెడ్డవేని సత్యంకలిసి కూలిపోయిన ఇళ్లను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దృష్టికి తీసుకు వెళ్లారు. వెంటనే ఆయన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ పరంగా వచ్చే సాయం అందించే విధంగా కృషి చేస్తానని బాధితులకు తెలిపారు.

## ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య

మానకొండూర్, మే 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన పప్పు ఆంజనేయులు (23) అనే యువకుడు ఆదివారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు గ్రామస్థులు తెలిపారు. స్థానిక గుట్ట వద్ద గల చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందాడు. మృతికి గల కారాణాలు తెలియాల్సి ఉంది.

# సుందరీకరణకు మోక్షమెప్పుడు..?

- ప్రమాదకరంగా మారిన నాంపల్లి చౌరస్తా
- రోడ్డు వెడల్పు చేయాలంటున్న వాహనదారులు
- కూడలిని అందంగా తీర్చిదిద్దాలని డిమాండ్



నాంపల్లి గ్రామపంచాయతీ చౌరస్తా

వేములవాడ టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ మున్సిపల్‌లో విలీనమైన నాంపల్లి గ్రామ కూడలి సుందరీకరణకు నోచుకోవడం లేదు. గ్రామపంచాయతీగా ఉన్న సమయంలో ఇరుకైన రోడ్డును డబుల్ చేసి కాస్త పొడిగించారు. మున్సిపల్‌లో విలీనమై ఏళ్లు గడుస్తున్నా నాంపల్లి గ్రామం కూడలి సుందరీకరణకు నోచుకోకపోవడంతో స్థానికుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వేములవాడ పట్టణంలోని పధాన కూడళ్లను సుందరీకరించిన నాంపల్లి కూడలి పైన మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహించారు. దీంతో నాంపల్లి గ్రామ కూడలిని సుందరీకరించాలనే డిమాండ్ వినబడుతోంది. వేములవాడ శ్రీరాజ రాజేశ్వర స్వామి ఆలయానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు నిత్యం వేల సంఖ్యలో తరలివస్తుంటాన్నారు.

వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లి గ్రామం నుంచి ప్రారంభమ వుతున్న సిరిసిల్ల, వేములవాడ, కరీంనగర్, బొజ్జపల్లికి వెళ్లే నాలుగు రోడ్ల కూడలి కావ డంతో భక్తులు, స్థానిక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తిప్పాపూర్ నుంచి నాంపల్లి పోచమ్మ ఆలయం వరకు రెండు వరుసల రోడ్డు పూర్తి అయినప్పటికి పోచమ్మ ఆలయం నుంచి నాంపల్లి చౌరస్తా వరకు రోడ్డు ఇరుకుగా ఉండటంతో వాహనదారులకు ఇబ్బందిగా మారింది. పోచమ్మ ఆలయం నుంచి నాంపల్లి చౌరస్తా వరకు రెండు వరుసల రోడ్డును చేస్తే వాహనదారులకు అనుకూలంగా ఉంటుందని భక్తులు, వాహనదారులు కోరుతున్నారు. నాంపల్లి గుట్టపైన కొలువుదీరిన లక్ష్మీనృసింహస్వామిని దృష్టిలో పెట్టుకుని కూడలి అభివృద్ధి పనులు చేపట్టాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

### రెండు వరుసల రోడ్డును ఏర్పాటు చేయాలి..

- పండుగు శంకర్, సంకెపల్లి, వాహనదారుడు



తిప్పాపూర్ నుంచి నాంపల్లి వరకు రెండు వరుసల రోడ్డు పూర్తిచేసి పోచమ్మ ఆలయం నుంచి నాంపల్లి గ్రామపంచాయతీ వరకు నిలిపివేశారు. నాంపల్లి గ్రామంలో మూలమలుపులు ఎక్కువగా ఉన్నాయి. నిత్యం వేల మంది భక్తులు ఆలయానికి వస్తుంటారు. రోడ్లు ఇరుకుగా ఉండటంతో రాత్రి వేళలో ఇబ్బందులు అవుతున్నాయి. నాంపల్లి గ్రామంలో సైతం రెండు వరుసల రోడ్డును ఏర్పాటు చేసి భక్తులకు, స్థానిక గ్రామల వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి.

### ఆధ్యాత్మికత ఉట్టిపడేలా కూడలిని తీర్చిదిద్దాలి..

- బొల్లు తిరుపతి, నాంపల్లి గ్రామస్థుడు



నిత్యం రాజన్న ఆలయానికి వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు స్వాగతం పలికే నాంపల్లి గ్రామపంచాయతీ వద్దగల కమాన్ చౌరస్తా రూట్‌లు సరిగా లేక వాహనదారులకు ఇబ్బందిగా మారింది. పట్టణంలోని చౌరస్తాలను అందంగా తీర్చిదిద్దినట్లుగా నాంపల్లి చౌరస్తాను ఆధ్యాత్మికత ఉట్టిపడేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలి.

## 29 క్వింటాళ్ల రేషన్‌సన్న బియ్యం పట్టివేత

మంథని, మే 25 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో అక్రమంగా నిల్వచేస్తున్న 29.20 క్వింటాళ్ల రేషన్‌సన్న బియ్యాన్ని పెద్దపల్లిజిల్లా మంథని పట్టణ శివారులో సివిల్ సప్లయిస్ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. మంథని ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం మంథని పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్ సమీపంలో ఉన్న రేకుల షెడ్‌లో పీడీఎస్ సన్నబియ్యాన్ని అక్రమంగా నిల్వచేయటానికి టీఎస్02యూడీ1387 అనే నంబర్ గల వాహనంలో తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న సివిల్ సప్లయిస్ అధికారులు అక్కడి వెళ్లగా వాహన డ్రైవర్ పరారయ్యాడు. బియ్యం బస్తాలతో ఉన్న వాహనాన్ని పోలీసు స్టేషన్‌కు తరలిస్తుండగా నల్లవెల్లి సది అనే వ్యక్తి అడ్డుపడి అధికారు లను దూషించాడు. నల్లవెల్లి సదితోపాటు వాహనం యజమాని ఆరె సంజీవ్, డ్రైవర్ రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. పట్టుకున్న బియ్యం విలువ రూ. 1.78 లక్షలు ఉంటుంది.



అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం

## ప్రశాంతంగా డీఈఈ సెట్



అభ్యర్థుల హాల్ టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది

రామగిరి, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన డీఈఈసెట్ ఆన్‌లైన్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం జరిగిన పరీక్షలో 137 మందికి గానూ 100 మంది హాజరు కాగా 37 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలో 144 మందికి గాను 103 మంది హాజరు కాగా 41 మంది గైర్హాజరయ్యారని ప్రిన్స్‌పాల్ విష్ణువర్ధన్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రామగిరి ఎస్ఐ చంద్రకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

# భక్తజన ప్రభంజనం

## పుష్కరాలకు పోటెత్తిన భక్తులు

- కిక్కిరిసిన కాళేశ్వర ముక్తీశ్వరాలయం
- 11వ రోజు 3.50 లక్షల మంది పుణ్యస్నానాలు

కాళేశ్వరం, మే 25 (ఆంధ్రజ్యోతి): పుష్కర స్నానాలతో భక్తులు పులకించి పోతున్నారు. కనీవినీ ఎరగని రీతిలో అంచనాలకు మించి సరస్వతి పుష్కరాలకు భక్తులు బారులు తీరారు. ఆదివారం 11వ రోజు పుణ్యసానాలు ఆచరించడానికి వచ్చిన భక్తజన సందోహంతో కాళేశ్వర క్షేత్రం కళకళలాడింది. స్నానమాచరించే ఘాట్లతో పాటు ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. ట్రాఫిక్ సమస్య యథావిధిగానే పునరావృతమైంది. నియంత్రణ చర్యలు చేపట్టడంలో పోలీసుశాఖ వైఫల్యాన్ని చవిచూడాల్సి వచ్చింది. వాహనాల అస్తవ్యస్తంతో పాటు భక్తుల ఇక్కట్లను తెలుసుకున్న రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు అధికార యంత్రాంగంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వయంగా జిల్లా పోలీ్‌ఎబాస్‌పై మంత్రి మండిపడి వారి వైఖరి పట్ల అసహనం వ్యక్తం చేయడం చర్చనీయాంశమైంది. సుమారు 3.50 లక్షల మంది భక్తులు కాళేశ్వర క్షేత్రానికి చేరుకొని పుణ్యస్నానాలు ఆచరించి పూజలు చేశారు.


కాళేశ్వరం, ముక్తీశ్వర ఆలయంలో భక్తుల రద్దీ

**● నేడు చివరి ఘట్టం**

సరస్వతి పుష్కరాల చివరి ఘట్టం సోమవారంతో ముగియనుంది. ఈనెల 15వ తేదీన ప్రారంభమైన పుష్కరాలు 26వ తేదీతో 12 రోజులతో పరిసమాప్తి కానుంది. చివరి రోజు శివయ్యకు అత్యంత ప్రీతికరమైన రోజు సోమవారం కావడంతో భక్తులు మరింత భారీగా తరలి వచ్చే అవకాశాలున్నట్లు అధికార యంత్రాంగం భావిస్తోంది. ఆదివారమే చాలా మంది కాళేశ్వర క్షేత్రానికి చేరుకున్నారు. ఇక్కడ బస చేసి సోమవారం దర్శించుకునేలా కార్యాచరణ రూపొందించుకున్నట్లు తెలుస్తోంది.





**● ట్రాఫిక్ సమస్య తీవ్రం**

పుష్కరాలకు వచ్చి వెళ్లే వాహనాలతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా తలెత్తింది. మహదేవపూర్ నుంచి కాళేశ్వరం వరకు దాదాపు15 కిలోమీటర్ల నిడివిలో ట్రాఫిక్ జామ్ అయింది. అధికారులు ఆలస్యంగా తేరుకొని ఔట్ గోయింగ్ బస్సులు, కార్లను పూస్కుపల్లి మీదుగా మళ్లించినప్పటికీ అటు కూడా ఐదు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడంతో భక్తులు ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కుకపోయారు. గంటల కొద్ది వాహనాలు కదలకపోవడంతో అందులో ప్రయాణిస్తున్న భక్తులు ఆకలి, దప్పికతో అలమటించి పోయారు. కాళేశ్వరం వచ్చివెళ్లే ప్రయాణికులు ట్రాఫిక్ సమస్య కారణంగా ఆర్టీసీ బస్సులు, కార్లలోనే గంటల తరబడి ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉదయం 8 గంటలకు మహదేవపూర్ చేరుకున్న వాహనాలు సాయంత్రం 5 గంటల వరకు కూడా కాళేశ్వరానికి చేరుకోలేకపోవడంతో అనేక అవస్థలు పడ్డారు.

**● వైభవంగా నవరత్నమాల హారతి**

కాళేశ్వర క్షేత్ర త్రివేణి సంగమంలో సరస్వతి పుష్కరాలను పురస్కరించుకుని 11వ రోజైన ఆదివారం రాత్రి 7.00 గంటల నుంచి 7.45 గంటల వరకు ఏడుగురు కాశీ పండితులు నవరత్నమాల హారతిని వైభవంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక సంగీత నేపథ్యంతో పలు అష్టకాలతో ఓంకార, నాగ, పంచ, సూర్య, చంద్ర, నంది, సింహ, కుంభ, నక్షత్ర హారతులతో కూడిన నవరత్న హారతిని ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయసీతక్క, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, సీఎంవో కార్యదర్శి శ్రీనివాసరాజు హాజరయ్యారు.


హారతినిస్తున్న కాశీ పండితులు


కిక్కిరిసిన కాళేశ్వరం దారి

## వచ్చేనెల 8 వరకు శుభ ముహూర్తాలు

- జూలై 25 వరకు లేవు
- తిరిగి శ్రావణమాసంలోనే శుభకార్యాలు
- 28తో ముగియనున్న వాస్తు కర్తరి

కరీంనగర్ కల్చరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): శుభ ముహూర్తాలకు కొద్దిరోజులే మిగిలిఉంది. వివాహాది శుభకార్యాలకు జూన్ 8వతేదీ వరకే ముహూర్తాలు ఉన్నాయి. ఈ స్వల్పకాల వ్యవధిలోనే వేలాది సంఖ్యలో శుభకార్యాలు జరుగనున్నాయి. దీంతో పెళ్లి మండపాలు, పురోహితులు, భాజా భజంత్రీలు, ఈవెంట్స్ నిర్వాహకులు, వంటవారు, పూలు, అలంకరణలు, దుస్తులు, కిరాణం వంటి వివిధ షాపుల వారికి గిరాకీ పెరగనుంది. జూన్ 9వ తేదీ నుంచి గురు మౌఢ్యంతో జ్యేష్ఠ మాసం అనగా జూన్‌లో ముహూర్తాలు లేవు. ఆ తర్వాత జూన్ 26వ తేదీ నుంచి జూలై 24వ తేదీ వరకు ఆషాడమాసం కారణంగా ముహూర్తాలు లేవు. జూలై 27వ తేదీ నుంచి ఆగస్టు 14వ తేదీవరకు శ్రావణమాసంలో తిరిగి ముహూర్తాలున్నాయి. ఆగస్టు 24వతేదీ నుంచి భాద్రపదమాసం, సెప్టెంబరు 22వ తేదీ నుంచి ఆశ్వయుజమాసం కారణంగా అక్టోబరు 21వతేదీ వరకు ముహూర్తాల కరువు ఏర్పడనుంది. అక్టోబరు 24వ తేదీ నుంచి తిరిగి ముహూర్తాలు కొనసాగనున్నాయి. మరోవైపు ఈ నెల 28వ తేదీన వాస్తు కర్తరి సమాప్తం కానుంది. దీంతో గృహ ప్రవేశాలు, బావులతవ్వకం, బోర్లు వేయడం, కట్టె పనులకు జూన్8 వరకు అనుకూలం.

## మిషన్‌భగీరథ పైపులైన్ లీకేజీ


ఎగిసి పడుతున్న మిషన్‌భగీరథ నీరు

ఎలిగేడు, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ధూళికట్టకు వెళ్లే ఆర్ అండ్‌బీరోడ్డుకు ఆనుకొని ఉన్న మిషన్ భగీరథ మెయిన్‌పైపులైన్ లీకేజీ కావడంతో తాగునీరు వృథాగా పోతోంది. అయినా పట్టించుకునేవారు కరువయ్యారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీటి లీకేజీపై గ్రిడ్ ఇంజనీరింగ్ అధికారులను 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌లో సంప్రదించడానికి ప్రయత్నం చేయగా వారు అందుబాటులో లేరు.

## పుష్కరాల్లో ఏర్పాట్ల పరిశీలన

భగత్‌నగర్, మే 25 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లిజిల్లా కాళేశ్వరంలో నిర్వహిస్తున్న సరస్వతీ పుష్కారాల్లో బస్ స్టేషన్ వద్ద ఏర్పాట్లను ఆర్టీసీ కరీంనగర్ రీజనల్ మేనేజర్ బి.రాజు, వరంగల్ రీజనల్ మేనేజర్ విజయభాను ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా బస్ స్టేషన్‌లో భక్తుల రద్దీని పర్యవేక్షించారు. భక్తులు గమ్యస్థానాలకు చేరుకోవడంలో అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు.

# నల్ల బ్యాడ్జీలతో జూనియర్ లెక్చరర్ల నిరసన

**● వార్షిక ఇంక్రిమెంట్‌ను మంజూరు చేయాలని డిమాండ్**

జగిత్యాల, మే 25 (ఆంధ్రజ్యోతి): వార్షిక ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని ఆదివారం జగిత్యాల జిల్లాలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు రెగ్యులరైజ్డ్ జూనియర్ లెక్చరర్లు నల్ల బ్యాడ్జీలతో హాజరై నిరసన తెలిపారు. 2023 మే 3వ తేదీన జీవో నంబరు 16 ద్వారా పలు శాఖలకు చెందిన కాంట్రాక్టు ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యులర్ చేసింది. ఇందులో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న 426 మంది రెగ్యులరైజ్ అయ్యారు. ఇందులో జగిత్యాల జిల్లాలో 131 మంది అధ్యాపకులు రెగ్యులరైజ్ అయ్యారు. 2024 మే నెలలో ఈ ఉద్యోగులు మొదటి ఏడాది ఇంక్రిమెంట్ పొందారు. 2025 మే నెలలో రెండవ సంవత్సరానికి సంబంధించిన ఇంక్రిమెంట్‌ను పొందవలసి ఉంది. అయితే సంబంధిత ఇంక్రిమెంట్‌ను పొందడానికి మే నెల చివరి వారంలో ట్రెజరీ కార్యాలయాల్లో బిల్లులు సమర్పించాల్సి ఉంటుంది. జిల్లాలోని పలువురు అధ్యాపకులకు సంబంధిత కళాశాల డీడీఓలు, అధికారులు ఇంక్రిమెంట్ బిల్లులు సమర్పించకపోవడం వివాదాస్పదంగా మారింది. రాష్ట్రంలోని అన్నిజిల్లాల్లోనూ ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనల ప్రకారం వ్యవహరించాల్సి ఉంటుంది. అయితే కొన్ని జిల్లాలలో ఇంక్రిమెంట్లు చేయడం, మరికొన్ని జిల్లాల్లో చేయకపోవడంతో అధ్యాపకుల్లో గందరగోళం నెలకొన్నది. వరంగల్, నిజామాబాద్, హనుమకొండ, ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం తదితర జిల్లాలలో పనిచేస్తున్న జూనియర్ లెక్చరర్లకు సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్‌లు రెండవ ఇంక్రిమెంట్ అందించేందుకు బిల్లులను రూపొందించి డీటీఓల్లో సబ్మిట్ చేశారు. కానీ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మాత్రం రెండవ ఇంక్రిమెంట్ లేకుండానే బిల్లులను రూపొందించినట్లు బాధిత అధ్యాపకులు అంటున్నారు.


జగిత్యాలలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

**● స్నేహపూర్వక వాతావరణాన్ని దెబ్బ తీయొద్దు**
**-కొట్టాల తిరుపతిరెడ్డి, తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు**



ఇంక్రిమెంటు పొందడం ఉద్యోగుల హక్కు. ఏడాది పాటు ఉద్యోగి అందించిన సేవలకు ప్రతిఫలంగా ప్రభుత్వం అందించే ఇంక్రిమెంట్‌ను ఆపడం బాధాకరం. కళాశాలల్లోని సామరస్య వాతావరణాన్ని దెబ్బతీసేందుకు కొద్దిమంది అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి నిబంధనల ప్రకారం రెగ్యులరైజ్డ్ జూనియర్ లెక్చరర్లకు ఇంక్రిమెంట్ అందించాలి.

**● బోర్డు నిబంధనల మేరకు చర్యలు**
**-బొప్పరాతి నారాయణ, జగిత్యాల జిల్లా ఇంటర్ విద్యాధికారి**

రెగ్యులరైజ్ అయిన జూనియర్ లెక్చరర్లకు ఇంటర్ బోర్డు నిబంధనల మేరకు ఇంక్రిమెంట్ కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇంటర్ పరీక్షల నిర్వహణ, ఫలితాల విడుదల, ఇతర కారణాల వల్ల కొంత జాప్యం నెలకొంది. ఈ వ్యవహారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటాం. రెగ్యులరైజ్ అయిన అధ్యాపకుల సర్టిఫికెట్ వెరిఫికేషన్, పోలీస్ ఎంక్వయిరీ పూర్తి చేయాల్సి ఉంది. అధ్యాపకులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

## శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి స్వల్పంగా వరద

**● ఎగువ నుంచి 2,315 క్యూసెక్కుల నీరు రాక**

జగిత్యాల, మే 25 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఆదివారం స్వల్పంగా వరద నీరు వస్తోంది. ఎస్సారెస్పీలోకి 2,315 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 12.07 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 7.568 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 652 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో కాకతీయ కాలువకు 100 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 321 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది. ఇదిలా ఉండగా 2024 జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 292.350 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 287.642 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

## ఏసీటీఓలకు..
# అందని గెజిటెడ్ హోదా

- ప్రభుత్వాలు మారినా నెరవేరని కల
- ఏళ్ల తరబడి అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నపాలు



కరీంనగర్ టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నుల శాఖ ఏసీటీఓలకు గెజిటెడ్ హోదా అందని ద్రాక్షలా మారింది. క్షేత్ర స్థాయిలో అమ్మకపు పన్ను (జీఎస్‌టీ) వసూలు చేయడంలో అత్యంత కీలకభూమిక పోషిస్తున్న ఏసీటీఓలు ఒక్క రూపాయి అదనపు భారం లేని గెజిటెడ్ హోదా కోసం ఏళ్ల తరబడి పోరాటం చేస్తున్నారు. 2017లో తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ ఆనాటి ప్రభుత్వానికి ఏసీటీఓల న్యాయమైన డిమాండ్లను పరిశీలించి గెజిటెడ్ హోదా ఇవ్వాలని వినతిపత్రం సమర్పించారు. అదే సమయంలో ఆనాటి టీఆర్‌ఎస్‌తో పాటు కొంత మంది అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎంఐఎం, సీపీఎం వంటి ప్రతిపక్ష పార్టీలు కూడా ఏసీటీఓలకు గెజిటెడ్ హోదా ఇవ్వాలంటూ ప్రభుత్వానికి సూచించారు. అయితే ఏసీటీఓల న్యాయమైన డిమాండ్‌కు మద్దతు పలుకుతూ గెజిటెడ్ అధికారుల సంఘం కూడా పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-2 పరీక్ష ద్వారా నియమితులైన ఏసీటీఓలకు గెజిటెడ్ హోదా ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఇప్పటి వరకు వారి న్యాయమైన డిమాండ్ పరిష్కారానికి నోచుకోలేదు. గత ప్రభుత్వం తమకు న్యాయం చేయలేదని కనీసం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా తమ సమస్యను పరిష్కరించి గెజిటెడ్ హోదా కల్పించాలని ఏసీటీఓలు కోరుతున్నారు. రాష్ట్రంలో 537మంది ఏసీటీఓలు గెజిటెడ్ హోదా అర్హత కలిగి, నాన్ గెజిటెడ్ ఉద్యోగులగానే సేవలందిస్తున్నారు. కరీంనగర్ డివిజన్‌లో 20 మంది ఏసీటీఓలు పన్నుల వసూళ్ల కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. కొంత మంది ఇప్పటికే నాన్ గెజిటెడ్ ఉద్యోగులుగానే పదవీ విరమణ పొందారని ఇప్పటికైనా ప్రభుత్వం గెజిటెడ్ హోదా కల్పించాలని ఏసీటీవోలు కోరుతున్నారు.

**వెంటనే గెజిటెడ్ హోదా కల్పించాలి**
**- ముజాహిద్ హుస్సేన్, వాణిజ్య పన్నుల శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు**



కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యను పరిష్కరించి గ్రూప్-2 ద్వారా నియమితులైన ఏసీటీఓలకు గెజిటెడ్ హోదా ఇవ్వాలి. గ్రూప్-2 ద్వారా నియమితులైన వారు ఇతర శాఖల్లో డిప్యూటీ తహశీల్దార్లుగా, సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు, కోఆపరేటివ్ రిజిస్ట్రార్‌లు, మున్సిపల్ కమిషనర్లుగా విధులు నిర్వహిస్తూ గెజిటెడ్ హోదాలో ఉన్నారు. పన్నుల ద్వారా ప్రభుత్వ ఆదాయం పెంచుతున్న ఏసీటీవోలకు మాత్రం గెజిటెడ్ హోదా ఇవ్వడం లేదు.

# భక్తజన సంద్రం.. రాజన్న ఆలయం

**● ఘనంగా మహాలింగార్చన ● మొక్కులు చెల్లించుకున్న భక్తులు**


భక్తులతో సందడిగా మారిన ఆలయ ప్రాంగణం


రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్నఆలయం ఆదివారం భక్తజన సంద్రంగా మారింది. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి సుమారు 60వేలమంది భక్తులు తరలి వచ్చినట్లు ఆలయాధికారులు అంచనా వేశారు. శ్రీరాజరాజేశ్వరస్వామివారి దర్శనం కోసం భక్తులు ఉదయాన్నే ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలను ఆచరించి కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు.ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు శ్రీపార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. రాజన్నకు ఎంతో ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో ప్రత్యేకపూజలో పాల్గొని తిరిగిప్రయాణమయ్యారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవోవినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఈవోలు, సూపరింటెండెంట్‌లు, పీఆర్వో ఏర్పాట్లను పర్యవేక్షించారు. మాస శివరాత్రి సందర్భంగా రాజన్న ఆలయ అర్చకులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం శ్రీస్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలు, సాయంత్రం ఆలయ అద్దాల మండపంలో మహాలింగార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అంతేకాకుండా ముస్తాబాద్ మండలం రాజక్కపేట గ్రామానికిచెందిన కోమటిరెడ్డి రాజిరెడ్డి సరిత దంపతులు రాజన్న నిత్యాన్నదాన సత్రానికి లక్ష రూపాయలు విరాళంగా ఏఈవో శ్రావణ్ కుమార్‌కు చెక్కును అందజేశారు.

**రాజన్న సేవలో సినీ డైరెక్టర్..**

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారిని తెలుగు సినీ డైరెక్టర్, ప్రొడ్యూసర్ ముద్దం నరేష్‌వర్మ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం ఆలయఅర్చకులు ఆశీర్వచనం ఇచ్చి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

# ఉమ్మడి జిల్లా క్రికెట్ లీగ్ పోటీలు ప్రారంభం

కరీంనగర్ స్పోర్ట్స్, మే 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడిజిల్లాస్థాయి క్రికెట్ లీగ్‌పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. అండర్-25 విభాగంలో మొదటిమ్యాచ్‌లను కరీంనగర్, వేములవాడలలో నిర్వహించారు. జిల్లాక్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి. ఆగంరావు, ఎస్.మురళీధర్‌రావు పోటీలను ప్రారంభించారు. మొదటిమ్యాచ్ జిల్లాకేంద్రంలోని సెయింట్‌అల్ఫోన్స్ మైదానంలో నిర్వహించారు. ఈ మ్యాచ్‌లో పెద్దపల్లి జట్టుపై కరీంనగర్‌టౌన్ విజయం సాధించింది. శాతవాహన యూనివర్సిటీ మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో జగిత్యాల జట్టుపై కరీంనగర్‌రూరల్ జట్టు గెలుపొందింది. వేములవాడలో జరిగిన మరో మ్యాచ్‌లో హుజూరాబాద్, హుస్నాబాద్ నియోజకవర్గ జట్టు సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గ జట్టుపై విజయం సాధించింది.


మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న అంపైర్లు

● సంక్షిప్తంగా..

### సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ

కరీంనగర్ రూరల్, మే 25(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారు 20వ డివిజన్ (ఆరెపల్లి)లో సీసీ రోడ్లకు కాంగ్రెస్ పార్టీ 20వ డివిజన్ ఇన్‌చార్జి ఎట్టెపు వేణు ఆదివారం భూమి పూజ చేశారు. ఎస్‌డీఎఫ్ నిధులు రూ.15లక్షలతో పనులు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బేతి సుధాకర్ రెడ్డి, గౌరయ్య, వెంకటరెడ్డి, బత్తిని అనిల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### హమాలీలకు యూనిఫాం పంపిణీ

కరీంనగర్ రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం నగునూర్‌లో కరీంనగర్ సింగిల్ విండో డైరెక్టర్ సాయిల్ల మహేందర్ నగునూర్ కొనుగోలు కేంద్రంలో 40వేల క్వింటాళ్లను విజయవంతంగా కొనుగోలు చేసినందుకు హమాలీలకు యూనిఫాం పంపిణీ చేశారు. ఒక్కో హమాలీకి జత చొప్పున 42 మంది అందజేశారు. ఈ కార్యక్రమంలో హమాలీ సంసఘం అధ్యక్షుడు నెల్లి రాజేశం, ఉపాధ్యక్షుడు తొంటి అంజనేయులు, కోశాధికారి నెల్లి రవీందర్ పాల్గొన్నారు.

### జీలుగ విత్తనాలను సరఫరా చేయాలి

ఇల్లందకుంట, మే 25 (ఆంధ్రజ్యోతి): రైతులకు జీలుగ, పెసరు, పచ్చిరొట్టె విత్తనాలను వెంటనే సరఫరా చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెల్పూరి రాము డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ కలెక్టర్ స్పందించి జీలుగ విత్తనాలను సత్వరమే సరఫరా చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.

### బాల్య మిత్రుడికి ఆర్థిక సాయం

హుజూరాబాద్ రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మనపల్లి గ్రామానికి చెందిన టి.నర్సయ్య ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో విషయం తెలుసుకున్న బాల్య మిత్రులు ఆదివారం ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల 7వ తరగతి బ్యాచ్ విద్యార్థులు రూ.26 వేల నగదును సేకరించారు. ప్రధానోపాధ్యాయుడు పాపిరెడ్డి ఆధ్వర్యంలో అందజేశారు.

# ప్రధాని మన్‌కీ బాత్ వీక్షించిన బీజేపీ శ్రేణులు



కొత్తగట్టులో వీక్షిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

భగత్‌నగర్/హుజూరాబాద్/శంకరపట్నం, మే 25 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని మండలంలోని కొత్తగట్టులో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆదివారం నాయకులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయంలో మహిళలు డ్రోన్లను సమర్థంగా వినియోగించడంపై ప్రధాని మోదీ ప్రశంసించారన్నారు. స్వయం సహాయ సంఘాలకు మరింత శక్తివంతం చేసి, చేతి వృత్తుల కళాకారులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, జయపాల్‌రెడ్డి, అనిల్, వెంకటరెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

● పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు నగరంలోని విద్యానగర్ 39వ డివిజన్ బీజేపీ శ్రేణులతో కలిసి మన్‌కీ బాత్ వీక్షించారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ప్రతీ ఒక్కరు దేశానికి అండగా నిలిచిన అంశాన్ని ప్రధానంగా పీఎం మోదీ ప్రస్తావించారని తెలిపారు. మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ప్రతీనెల 23 జాతీయ భాషలు, 31 మాండలికాలలో అన్ని కేంద్రాల ద్వారా ఆకాశవాణి ప్రసారం చేస్తున్నట్లు చెప్పారు. సామాన్యులతో అనుసంధానానికి కార్యక్రమం ఎంతో దోహదపడుతుందన్నారు. సంపత్, పాలజి ప్రదీప్, న్యాత ప్రవీణ్, లక్ష్మణ్, అశోక్, చైతన్య అబి, రాంచరణ్, బన్నీ పాల్గొన్నారు.

● హుజూరాబాద్ పట్టణంలో ప్రధాని నరేంద్రమోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు వీక్షించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు తూర్పాటి రాజు, గంగిశెట్టి ప్రభాకర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

### ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

సుభాష్‌నగర్, మే 25(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణను అరికట్టాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశం అయ్యారు. అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు చేపట్టి అక్రమంగా రవాణా చేస్తున్నారని ఆరోపించారు. అనుమతులు ఉన్నవారు అంతకుమించి తవ్వకాలు చేపడుతున్నారన్నారు. ఇసుక లారీలతో ఆయా గ్రామాల రోడ్లు దెబ్బతింటున్నట్లు చెప్పారు. లారీలను రోడ్డుకు ఇరువైపులా నిలపడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డికి వెంకట్ ఎక్సలెన్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న నరేందర్ రెడ్డి

భగత్‌నగర్, మే 25 (ఆంధ్రజ్యోతి): అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్, వీఆర్‌ఎన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ వి.నరేందర్‌రెడ్డికి వెంకట్ ఫౌండేషన్ వై.రఘునాథం ఎక్సలెన్స్ అవార్డును ప్రదానం చేసింది. ఆదివారం నగర శివారులోని ఒక ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీ నారాయణ, వెంకట్ ఫౌండేషన్ ఫౌండర్, చైర్మన్ గంప వెంకట్ చేతులమీదుగా నరేందర్ రెడ్డి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ నరేందర్‌రెడ్డి రాష్ట్ర విద్యారంగానికి మార్గదర్శకంగా నిలుస్తున్నారని, విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్‌ను అందిస్తున్నారని అన్నారు. రాష్ట్ర విద్యారంగంలో అత్యుత్తమ ఫలితాలను సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నందుకు అవార్డు అందజేసినట్లు చెప్పారు. అనంతరం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ 35 ఏళ్లుగా విద్యారంగానికి అల్ఫోర్స్ ద్వారా అత్యుత్తమ సేవలందిస్తున్నట్లు, ఉత్తమంగా తీర్చిదిద్దడంతోపాటు ప్రతిష్ఠాత్మక స్థానాల్లో స్థిరపడేందుకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు చెప్పారు. అవార్డు బాధ్యతను మరింత పెంచిందని, ఇందుకు కృషి చేసిన సిబ్బందికి, ప్రోత్సాహాన్ని అందిస్తున్న తల్లిదండ్రులకు అంకితమిస్తున్నానని తెలిపారు.

## ఐకమత్యంతో పోరాడితేనే సమస్యల పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న కొప్పుల శంకర్

జమ్మికుంట, మే 25 (ఆంధ్రజ్యోతి): కార్మికులు ఐకమత్యంతో పోరాడితేనే సమస్యలు పరిష్కారం అవుతాయని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ అన్నారు. ఆదివారం జమ్మికుంట పట్టణంలో గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాటాల ద్వారానే కార్మికుల హక్కులు సాధించుకున్నామన్నారు. ప్రభుత్వాలు, పాలకుల దయాదాక్షిణ్యాలతో ఏనాడూ కార్మిక సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచినట్లు పారిశుధ్య కార్మికులకు కనీసవేతనం, ఉద్యోగ భద్రత వంటి హామీలు అమలు చేయాలన్నారు. గ్రామస్థాయి నుంచి పంచాయతీ కార్మికులు నిర్మాణ పరంగా ఐక్యం కావాలని, కనీస వేతనం రూ.26వేలు సాధించే వరకు పోరాటాలు నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొత్తూరి మల్లయ్య, ఎండిగ రవీందర్‌రావు, వడ్లూరి లక్ష్మీనారాయణ, లద్దునూరి కుమార్, ములుగురి ప్రేమ్‌కుమార్, బండి సమ్మయ్య, బొబ్బిలి రమేష్, రాములు, భద్రయ్య, రవి, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

## ఆలోచింపజేసిన 'కవి సంధి' కార్యక్రమం




కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్రసాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యుడు ప్రసేన్

కరీంనగర్ కల్చరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఫిలిం భవన్‌లో కేంద్ర సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో కవి, రచయిత అన్నవరం దేవేందర్ సాహిత్యంపై ఆదివారం నిర్వహించిన కవి సంధి కార్యక్రమం ఆద్యంతం ఆలోచింపజేసింది. ఈ సందర్భంగా కవి తన కవిత్వ జీవన యాత్రను వివరిస్తూ కవితా పఠనం చేశారు. మూడు దశాబ్దాలకుపైగా సాహిత్య రంగంలో ప్రయాణం చేస్తున్న దేవేందర్ సాహిత్య చింతనను కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు తెలుసుకున్నారు. అనంతరం కవి, కేంద్రసాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యుడు ప్రసేన్ మాట్లాడుతూ తెలంగాణ పల్లె గొంతుక కవి అన్నవరమని అన్నారు. ఇంటి భాషలో కవిత్వాన్ని, వచనాన్ని సమర్థవంతంగా సృజిస్తూ తెలంగాణ మట్టి కవిగా దశాబ్దాల కాలం నుంచే గుర్తింపు పొందారన్నారు. ఒకనాడు కొన్ని పట్టణ కేంద్రాలకే పరిమితమైన అకాడమీ కార్యకలాపాలను కరీంనగర్, మహబూబాబాద్, వరంగల్ వంటి పట్టణాలకు విస్తరిస్తున్నట్లు చెప్పారు. అంతకుముందు సీనియర్ పాత్రికేయుడు ఎండీ మునీర్, రచయిత మెరుగు అంజయ్యకు నిర్వాహకులు నివాళి అర్పించారు. డాక్టర్ నలిమెల భాస్కర్, నగునూరి శేఖర్, డాక్టర్ బొద్దుల లక్ష్మయ్య, జూకంటి జగన్నాథం, డాక్టర్ బీవీఎన్ స్వామి, గాజోజు నాగభూషణం, గాజుల రవీందర్, కందుకూరి అంజయ్య, బూర్ల వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, సీవీ కుమార్, విలాసాగరం రవీందర్, మాడిశెట్టి గోపాల్, కిషన్, తిరుపతి, వెంకటేశ్వర్లు, కేవీస్ అనంతాచార్య, నిర్మలారాణి, సుజాత, బసవేశ్వర్, వేణు, వరప్రసాద్, నసీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

### 'ఆట కోయిలలు' కథల పుస్తకం ఆవిష్కరణ

కరీంనగర్ కల్చరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి తెలుగు రాష్ట్రాల స్థాయి బాల సాహిత్య సమ్మేళనంలో కరీంనగర్ తెలుగు ఉపాధ్యాయ కవి, రచయిత కూకట్ల తిరుపతి సంపాదకత్వం వహించిన 'ఆట కోయిలలు' సుల్తాన్‌పూర్ బడి పిల్లల కథల పుస్తకాన్ని తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త, పద్మభూషణ్ కోడూరు ఈశ్వర వరప్రసాదరెడ్డి, సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ చెన్నయ్య, జాతీయ పుస్తక సంస్థ తెలుగు సంపాదకుడు డాక్టర్ పత్తిపాక మోహన్, గరిపల్లి అశోక్, కందుకూరి భాస్కర్ పాల్గొన్నారు.

### ముగిసిన చదరంగం పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 25 (ఆంధ్రజ్యోతి): కరీం నగర్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-17 బాలబాలికల చదరంగం పోటీలు ఆదివారం ముగిశాయి. జిల్లా కేంద్రంలోని రాంనగర్ విశ్వనాథ్ చెస్ అకాడమీలో నిర్వహించిన పోటీల్లో ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 35 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ముఖ్య అతిథులు రాచకొండ సత్యనారాయణగౌడ్, విశ్వనాథ్ అకాడమీ డైరెక్టర్, కోచ్ విశ్వనాథ్ ప్రసాద్ పతకాలు అందజేశారు. కార్యక్రమంలో పోటీల నిర్వహణ కమిటీ కన్వీనర్ అంతగిరి రాజేంద్రప్రసాద్, చీఫ్ ఆర్బిటర్ సీహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● పోటీల విజేతలు

బాలుర విభాగం: బాల సంకుల అమన్‌రామ్ ప్రథమ, అమిరిశెట్టి నిశిత్ ద్వితీయ, వేముల అభిరామ్ తృతీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈగ శివ చైతన్య నాలుగో స్థానం సాధించి స్టాండ్‌బైగా ఎంపికయ్యాడు.

బాలికల విభాగం : పి.పరిణీత ప్రథమ, కె.సాధన ద్వితీయ, టి.మోక్ష తృతీయ స్థానం సాధించారు. బి.యశశ్రీ నాలుగో స్థానం, ఎస్.శ్రీహర్షిణి స్టాండ్‌బైగా ఎంపికయ్యారు.

### శ్రీరాజరాజేశ్వర మున్నూరు కాపు సంఘం కార్యవర్గం

కరీంనగర్ రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): శ్రీరాజరాజేశ్వర మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కరీంనగర్ శివారు బొమ్మకల్‌లోని మున్నూరు కాపు సంఘం భవనంలో ఎన్నికలను నిర్వహించారు. అధ్యక్షుడిగా కొండపల్లి సతీష్ పటేల్, జనరల్ సెక్రెటరీ బొమ్మిడి శ్రీనివాస్, ట్రెజరర్‌గా పొన్నాల సతీష్ పటేల్, ఉపాధ్యక్షులుగా మామిడి రవీందర్ పటేల్, బొమ్మిడి విజయ్ కుమార్, చల్ల శ్రీనివాస్, పురాణం లక్ష్మీకాంతం, గణసారి సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ క్రాంతి కుమార్, కొండపల్లి వల్లభాయ్, చింతల హరిశంకర్, చల్ల వినోద్, చాడా శ్రీనివాస్ రెడ్డి, బొమ్మెర అమర్ , పొన్నాల శ్రావణ్, మామిడి కిరణ్, గణసారి ప్రసాద్ పాల్గొన్నారు.

### బజరంగ్‌దళ్ కార్యకర్తలకు మామిడి పండ్ల పంపిణీ

కరీంనగర్ కల్చరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): బజరంగ్‌దళ్ శౌర్య ప్రశిక్షణ వర్గ ముగింపు కార్యక్రమంలో డాక్టర్ బొప్పు రాజమల్లు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో కార్యకర్తలకు ఉత్తమ రైతు బొప్పు శ్రీహరి సేంద్రియ పద్ధతిలో పండించిన మామిడి పండ్లను ఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు ఇనుగంటి మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### నేడు వైశాఖ అమావాస్య.. రేపు శని జయంతి

కరీంనగర్ కల్చరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): అమావాస్య అంటే చీకటి రోజు అని అర్థం. హిందూ సంప్రదాయంలో లోతైన ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను కలిగి ఉన్న తిథి. మే 26న వైశాఖ అమావాస్య అవుతుంది. దీన్ని సోమవతీ అమావాస్య అంటారు. 26వ తేదీ మధ్యాహ్నం 12-11 గంటలకు ప్రారంభమై 27, మంగళవారం మధ్యాహ్నం 12-02 గంటల వరకు కొనసాగనుంది. 26న మధ్యాహ్నానికి అంటే అపరాహ్న వ్యాప్తికి అమావాస్య ఉండటంతో పిండ పితృయజ్ఞాలు, పూర్వీకులు, గతించినవారి స్మరణలో గడపాలి. 27నశనిదేవుని జయంతి కావడంతో మరింత విశిష్టత సంతరించుకుంది. ఇక ఈ రోజే శని భగవానుడు పుట్టిన రోజు కావడంతో దీపారాధన, శనికి తిల తైలాభిషేకాలు, అలంకారాది, అర్చనలు చేయడంతో శని గ్రహశాంతి పొందవచ్చని, ఈ నెల 26, 27 తేదీలు చాలా విశిష్టమైన రోజులు అని ప్రముఖ పురోహి తులు గంగవరం నాగేశ్వరశర్మ తెలిపారు.

### యువకుడి ఆకస్మిక మృతి

హుజూరాబాద్ రూరల్ మే 25 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన నీరటి శశీశ్వర్ (32) ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. ఇటీవల హనుమాన్ మాల ధరించిన శశీశ్వర్ ఈ క్రమంలో ఉపవాసం చేయడంతో ఆరోగ్యం దెబ్బతిన్నది. తల్లిదండ్రులు మెరుగైన చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో గుండెపోటుతో మృతి చెందాడు.

### ఎమ్మెల్యే కవ్వంపల్లిపై మాట్లాడే అర్హత రసమయికి లేదు

తిమ్మాపూర్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ గురించి మాట్లాడే అర్హత మాజీఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు లేదని కాంగ్రెస్‌నాయకులు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండారి రమేష్, ఇతర నాయకులు మాట్లాడారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణపై మాజీఎమ్మెల్యే రసమయి అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. తిమ్మాపూర్‌లో ఇచ్చిన డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారుల వద్ద ఎంత వసూళ్లు చేశారో అందరికీ తెలుసునని అన్నారు. ప్రతిపక్షంలో ఉండిబాధ్యతగా మెదాలన్నారు.బీఆర్ఎస్ హయాంలో రామకృష్ణకాలనీలో అర్ధాంతరంగా నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాల గురించి రసమయి బాలకిషన్ ఇప్పుడు మాట్లాడటం విచిత్రంగా ఉందన్నారు. కార్యక్రమంలో బండారి రమేష్, ఎస్ఎల్‌గౌడ్, గోపు మల్లారెడ్డి, మామిడి అనిల్‌కుమార్, తుమ్మనపల్లి శ్రీనివాసరావు,కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు





సిద్ధార్థ ఉన్నతపాఠశాల 2007-2008 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు



శంకరపట్నంలో ఆత్మీయ సమ్మేళనంలో 1992-93బ్యాచ్ విద్యార్థులు

## అలరించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు

కరీంనగర్ కల్చరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సిద్ధార్థ ఉన్నతపాఠశాల 2007-2008 పదోతరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆకట్టు కుంది. 17ఏళ్ల తర్వాత ఆదివారం స్థానిక ప్రైవేట్ రెస్టారెంట్‌లో కలుసుకున్న విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో స్థిరపడిన విద్యార్థులను యాజమాన్యం బాధ్యులు దాసరి శ్రీనివాసరెడ్డి, దాసరి జగత్‌పాల్‌రెడ్డి, దాసరి శ్రీపాల్‌రెడ్డి అభినందించారు. ఉపాధ్యాయులు డి.రాజారాంమోహన్‌శర్మ, బి.భాస్కర్ రెడ్డి, పి.భాస్కర్, ఆర్.శ్రీనివాస్, ఎం.శ్రీనివాస్, ఎ.సత్యవతి, డి.శ్రీనివాస్‌బాబు, డి.శైలజ తదితరులు పాల్గొన్నారు.


**శంకరపట్నం:** శంకరపట్నం మండలం వంకాయగూడెం గ్రామ పరిధిలోని మాధవసాయి గార్డెన్‌లో 1992-93లో తాడికల్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు రామయ్య, శ్యాంసుందర్, కాళిదాస్, నాగభూషణం, రాంరెడ్డి సన్మానించారు.

**గంగాధర:** గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లి నరేంద్రవిద్యాలయంలో 2012-13 బ్యాచ్ పదోతరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆకట్టుకుంది. యాజమాన్యం రాజేశం, గోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు,పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

**సైదాపూర్:** మండల కేంద్రంలోని వెన్కేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006-07 సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమేళనం ఆదివారం అదేపాఠశాలఆవరణలో అత్యంత ఆత్మీయంగా జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు అందరు ఒకచోటచేరి ఆత్మీయంగా పలకరించుకున్నారు. పాతజ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు.



గంగాధరలో 2012-13బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు



సైదాపూర్‌లో 2006-07బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు

### తిమ్మాపూర్ రెడ్డి సంఘం అధ్యక్షుడిగా కేతిరెడ్డి అంజిరెడ్డి

తిమ్మాపూర్, మే 25, (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఆదివారం తిమ్మాపూర్ రెడ్డిసంఘ సమావేశం నిర్వహించారు. సంఘం అధ్యక్షు డిగా కేతిరెడ్డి అంజిరెడ్డి ఎన్నికకాగా ప్రధాన కార్యదర్శిగా ఓరగంటి సంతోష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా తుమ్మెటి రాజిరెడ్డి, రామంచ రాంరెడ్డి, కోశాధికారిగా వావిలాల అంజిరెడ్డి, సహాయ కార్యదర్శులుగా ఎడ్ల సంపత్‌రెడ్డి, మోతీ సుధాకర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా ఎడ్లచిన్న జోగిరెడ్డి, పాలకవర్గ సభ్యులుగా కాసం నరసింహారెడ్డి, తదితరులు ఎన్నికయ్యారు.

### అందుబాటులో జీలుగ విత్తనాలు

చొప్పదండి/తిమ్మాపూర్/సైదాపూర్, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలాల్లోని ప్రాథమిక సహకార సంఘాల్లో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి వంశీకృష్ణ, సరేందర్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.

30కిలోల బస్తాకు 2317.50 రూపాయలని, రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్‌తో జీలుగా బస్తాలు తీసుకోవాలని పేర్కొన్నారు. 30కిలోల బస్తా ఒక హెక్టార్ పొలానికి వాడుకోవచ్చని ఆయన తెలిపారు. సైదాపూర్ మండల కేంద్రంలోని వెన్కేపల్లి విశాల సహకార పరపతి సంఘంలో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి తెలిపారు.

### హుజూరాబాద్ వాసికి జాతీయస్థాయి అవార్డు

హుజూరాబాద్, మే 25 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణానికి చెందిన ఆడెపు ధీరజ్ అనే యువకుడు జాతీయస్థాయి గ్రేట్‌పీపుల్‌మేనేజర్స్ అవార్డును అందుకున్నారు. భారతదేశవ్యాప్తంగా టాప్ 100 మందిని గ్రేట్‌పీపుల్‌మేనేజర్స్ ఆఫ్ ఇండియా సెలెక్ట్‌చేయగా అందులో నుంచి ధీరజ్ ఎంపికయ్యాడు. రెండ్రోజులక్రితం ముంబైలో నిర్వహించిన జీఎంఐ సమ్మిట్‌లో అవార్డును, సర్టిఫికెట్‌ను అందజేశారు. దేశంలో వందమంది వ్యాపారవేత్తలలో హుజూరాబాద్‌కు చెందిన ధీరజ్ ఎంపిక కావడంపై పలువురు హర్షంవ్యక్తం చేస్తున్నారు.

### పంపిణీకి సిద్ధంగా పాఠ్యపుస్తకాలు

మానకొండూర్, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం అయింది. మండలంలో పాఠశాలల్లో ఒకటవ తరగతి నుంచి 10వ తరగతి చదివే మొత్తం విద్యార్థులు 3470మంది ఉన్నారు. కాగా 95శాతంతో మొత్తం 17070పాఠ్యపుస్తకాలు మొదటి విడత కింద ఎమ్మార్సీ కార్యాలయానికి చేరుకున్నట్లు సమాచారం. జూన్12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానుండడంతో ఆయా పాఠశాలలకు రెండు, మూడు రోజుల్లో విద్యార్థులకు సరిపడా పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసేందుకు అధికారులు సిద్ధం అయ్యారు.

### ముగిసిన ధాన్యం కొనుగోళ్లు

సైదాపూర్, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో ధాన్యం కొనుగోళ్లు ముగిశాయి. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా త్వరితగతిన కొనుగోళ్లు పూర్తి చేశారు నిర్వాహకులు. అకాల వర్షాలకు ఎక్కడ కూడా ధాన్యం తడవలేదు. దీంతో అటు గొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైతులు ఊపిరిపీల్చుకున్నారు. మండలంలో మొత్తం 29ధాన్యం కొనుగోలు కేంద్రాలుండగా సుమారు 1.44లక్షల క్వింటాళ్ల దొడ్డు, 23వేళ క్వింటాళ్ల సన్నరకం ధాన్యం కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా వెన్కేపల్లి ఎల్ఎస్‌సీఎస్ చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి మాట్లాడుతూ సంఘం పరిధిలో రైతులు అకాల వర్షం నుంచి తప్పించుకునేందుకు సహకరించిన హమాలీలు, లారీ, ట్రాక్టర్ యజమానులకు కృతజ్ఞతలు తెలిపారు.